క్లుప్తంగా

ఎన్నిక


రవి, అధ్యక్షుడు

నర్సంపేట రూరల్ : నాయీబ్రాహ్మణుల సేవా సంఘం నర్సంపేట మండల కమిటీ అధ్యక్షుడిగా గొలనకొండ రవిని ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ముదికుంట్ల యాదగిరి ప్రకటించారు. నర్సంపేట మున్సిపాలిటి ఆవరణలో నాయీబ్రాహ్మణుల సేవా సంఘం ఎన్నికలు నిర్వహించగా మొత్తం 109 ఓట్లు పోలుకాగా ప్రత్యర్థి మొగిళిచర్ల సందీప్ పై గొలనకొండ రవి ప్యానల్ విజయం సాధించింది. తన ఎన్నికకు సహకరించి ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



నల్లబెల్లి : నల్లబెల్లి ఇన్‌చార్జ్ ఎస్సైగా అజ్మీరా సురేష్ నాయక్ నియమితులయ్యారు. నర్సంపేట ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఆయనను నల్లబెల్లి పోలీస్ స్టేషన్‌కు అటాచ్ చేశారు. మంగళవారం సురేష్ నాయక్ బాధ్యతలు స్వీకరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని ఎస్సై పేర్కొన్నారు. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండి వారికి న్యాయం జరిగేలా చూస్తానని పేర్కొన్నారు. అంతకుముందు ఏఎస్సై రాజేశ్వరి, పోలీస్ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

వాహనాలు సీజ్

సంగెం : మండలంలో రోడ్డు రవాణా సంస్థ ఎంవీఐ కోలా రవీందర్ ఆధ్వర్యంలో మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో పేపర్లు లేని వాహనాలు, రోడ్డు టాక్స్ చెల్లించని ఐదు టిప్పర్లు, ఒక ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వాహనాలకు సరైన ధ్రువపత్రాలు లేకుండా, టాక్స్ చెల్లించకుండా రోడ్డుపైకి వస్తే వాహనాలు సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చర్య తీసుకోవాలి



నల్లబెల్లి : మండలంలోని బోల్లోనిపల్లి గౌడ సంఘం భూమిని ఆక్రమించుకున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ పొలిట్ బ్యూరో సభ్యుడు అనంతుల రమేష్ గౌడ్ అన్నారు. గీత కార్మికులతో కలిసి అక్రమణకు గురైన భూమిని ఆయన మంగళవారం సందర్శించారు. కార్యక్రమంలో నాయకులు గట్టు సమ్మలు, తిప్పని సాంబయ్య, భిక్షపతి, తిప్పని రవీందర్, గొడిశాల సదానందం, కందుల శ్రీనివాస్, పెరుమాడ్ల రాజు కుమార్, తాళ్లపెల్లి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

సంచార పశు వైద్యశాల వాహనం తనిఖీ



నర్సంపేట రూరల్: పట్టణంలోని సంచార పశు వైద్యశాల 1962 వాహనాన్ని ఆ సంస్థ ప్రాజెక్టు హెడ్ డాక్టర్ భగీష్ మిశ్రా, వరంగల్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ రాములు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌లోని రిజిస్టర్లు, పరికరాలు, మందులను క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ.. వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో 1962 వైద్యాధికారి రమేష్, పారవెటి శిరీష, హెల్పర్ బి.శ్యాం, రాజేష్, 108 సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



నర్సంపేట రూరల్ : బ్యాంక్ రుణాలను వినియోగించుకోని ఆర్థికంగా ఎదగాలని ఎల్‌పీఎం రాజు అన్నారు. నర్సంపేట మండలంలోని గురిజాల రైతు వేదికలో కెనారా బ్యాంక్ ఆధ్వర్యంలో స్వయం సహాయ సంఘ సభ్యులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌బీ ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లతో ప్రతీ ఒక్కరు ఆర్థికంగా ఎదగాలని, దుబారా, వృథా ఖర్చులు తగ్గించుకోని బ్యాంక్ ద్వారా ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చదువు రాని సభ్యులు చదువుకోవాలని, కనీసం సంతకాలు అయినా నేర్చుకోవాలని సూచించారు. స్మార్ట్ ఫోన్ ద్వారా ఆర్థిక లావాదేవీలు డిజిటల్ విధానం ద్వారా పొదుపు, చెల్లింపులు చేయాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా ఓటీపీలు అడిగితే చెప్పకూడదన్నారు. అదే విధంగా ప్రభుత్వ పథకాలు, ఇన్సూరెన్స్ స్కీంలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మమత, శర్మ, ఆర్వో ఆఫీసర్ శివ, శ్రీధర్, ఎఫ్ఓ తేజ, ఏపీఎం మహేందర్, సీసీలు మహేందర్, శోభ, భాస్కర్‌రావు, వీఓఏలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

● ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట రూరల్ : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. నర్సంపేటలో రూ.కోటి విలువైనా చెక్కులను లబ్ధిదారులకు మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు అకాల మరణం చెందితే ఎలాంటి ఆలస్యం లేకుండా రైతు బీమా ద్వారా ఆ కుటుంబాన్ని అండగా నిలిచే ప్రభుత్వం దేశంలో ఎక్కడైనా ఉందా అని ప్రశ్నించారు. ఎల్ఓసీ, సీఎంఆర్ఎఫ్ ద్వారా కోట్ల రూపాయలను ప్రతినెలా అందిస్తున్నామన్నారు. ప్రతిపక్షాలు పాదయాత్రలో గుర్తించలేని విధంగా గ్రామాలు, తండాలు అభివృద్ధి చెందాయన్నారు. రైతుబీమా కింద 16చెక్కులు, బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ ఇన్సూరెన్స్ 2చెక్కులు, సీఎంఆర్ఎస్ 65చెక్కులు మొత్తం రూ.1.06 కోట్ల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోత్ రామస్వామినాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, అన్ని మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, రైతు సమన్వయ సమితి బాధ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు, గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఫీల్డ్ అసిస్టెంట్లు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలపై శాసన సభలో మాట్లాడి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని కలిసి టీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర నాయకురాలు నల్ల భారతి, జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజులు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక వర్గ సమస్యల పట్ల అవగాహన ఉండి అవకాశం దొరికినప్పుడల్లా నిరంతరం వారి గొంతుకగా ఉండి శాసనసభలో మాట్లాడడం కార్మిక వర్గానికి గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కేలోతు స్వామి చౌహాన్, మామునూరి రమేష్, వేల్పుల రాజు, సత్యం, మోహన్, తోటకూర సుమన్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి..

అత్యధిక జనాభా గల మాదిగలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఎస్సీ వర్గీకరణలో ఉపకులాలు చేయాలని తెలంగాణ మాదిగ దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈదునూరి యాకయ్య మాదిగ అన్నారు. మాదిగల డిమాండ్‌పై నర్సంపేట ఎమ్మెల్యేకు మెమోరాండం అందించారు.

విద్యార్థినికి ఎమ్మెల్యే ఆర్థిక చేయూత

ఖానాపురం : మండలంలోని బుధరావుపేట గ్రామానికి చెందిన తాళ్ల శ్రీజ మోడల్ స్కూల్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైంది. కాగా బుధవారం చెన్నైలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి వెళ్లనుంది. నిరుపేద కుటుంబం కావడంతో నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి రూ.10వేల ఆర్థికసాయం అందజేసి అభినందించారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని సూచించారు.

నిధులుంటేనే పనుల తీర్మానాలు చేయాలి

● డీపీఓ కల్పన


డీపీఓను మర్యాద పూర్వకంగా కలిసిన సర్పంచ్ మల్లారెడ్డి

గీసుకొండ: పలు గ్రామ పంచాయతీల్లో నిధులు లేకున్నా పనులు చేయడానికి తీర్మానాలు చేస్తున్నారని, అలా కాకుండా.. నిధులు ఉంటేనే చేయాలని డీపీఓ కల్పన అన్నారు. మంగళవారం గంగదేవిపల్లిలో గీసుకొండ, రాయపర్తి, వర్ధన్నపేట మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతీ పంచాయతీలో వంద శాతం ఇంటి పన్నులను వారం రోజుల్లో వసూలు చేయడానికి కృషి చేయాలన్నారు. మూడు మండలాల్లోని అంగడి బకాయిలను ఈనెల చివరి నాటికి వసూలు చేయాలని, లేదంటే కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మన ఊరు–మన బడి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, చెత్త ద్వారా కంపోస్టు ఎరువు తయారీ, పలు పనులు, సేవలను ఆన్‌లైన్ చేయాలన్నారు. ఉదయం 9 గంటల్లోపే డీఎస్ఆర్, అటెండెన్స్‌తో నాలుగు ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద అభివృద్ధి ప్రణాళికల బోర్డు ఏర్పాటు చేయాలని, పెండింగ్ విద్యుత్ బిల్లులు చెల్లించాలని, గ్రామ కంఠం భూమిలో అనుమతి లేని ఇళ్ల నిర్మాణాల వివరాలు సేకరించాలన్నారు. సమావేశంలో డీఎల్‌పీఓ కీర్తి ప్రభాకర్, ఎంపీఓ ఆడెపు ప్రభాకర్, సుమారు 70 మంది పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. కాగా.. గంగదేవిపల్లికి వచ్చిన డీపీఓను సర్పంచ్ గోనె మల్లారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



వర్ధన్నపేట : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు. మంగళవారం మండలంలోని దమ్మన్నపేటలో ఏఎన్ఎం శోభారాణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెల్త్ మేళా కార్యక్రమంలో ఆయన పాల్గొని యోగాపై వివరించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు మాధవి, అరుణ, స్వరూప, రమ, అంగన్‌వాడీ టీచర్ కమల, గ్రామస్తులు పాల్గొన్నారు.

నర్సంపేట రూరల్ : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా గంటపాటు యోగా చేయాలని చెన్నారావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సరోజన తెలిపారు. మండలంలోని ముగ్ధంపురం గ్రామ పల్లె దవాఖాన ఆవరణలో యోగాపై అవగాహన కల్పించారు. వైద్యసిబ్బంది, ప్రజలకు వ్యాయామాలు నేర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెండ్యాల జ్యోతిప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కుదిరిన వేతన ఒప్పందం

నర్సంపేట రూరల్ : నర్సంపేట డివిజన్ రైస్ మిల్లు డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్మికులకు, యాజమానులకు మధ్య చర్చలు నిర్వహించారు. ప్రతినెల ఇస్తున్న వేతనాలకు అదనంగా రూ.1,800 ఇస్తామని సంఘం అధ్యక్షుడు తాళ్ల చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు దిడ్డి బుచ్చిరాములు, కిరణ్‌కుమార్, కోటేశ్వర్, వెంకటరెడ్డి, భాస్కర్, శరత్, బాబు, సురేందర్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బాధిత కుటుంబాలకు పరామర్శ



రాయపర్తి : మండలంలోని పెర్కవేడులో ఇటీవల మృతిచెందిన బండి యాకమ్మ, బండి బక్క సాయిలు, అంగిరేకుల గురునాథం, ఊగ వెంకటమ్మ, రంగు యాకమ్మ కుటుంబాలను మంగళవారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావి న్యూవిజన్ హైస్కూల్‌లో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎంగా కోట నిహారిక, కరస్పాండెంట్‌గా గొర్రె ధనుష్, డీఈఓగా రుత్విక్, ఎంఈఓగా గణేష్‌లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు

వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని బూర్గుమళ్ల గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు నాలుగో రోజు ఘనంగా నిర్వహించారు. మంగళవారం మహిళలు అష్టలక్ష్మి పూజలను నిర్వహించారు. నేడు(బుధవారం) బొడ్రాయి విగ్రహాల ఊరేగింపు, సాయంత్రం గ్రామం చుట్టూ నవధాన్యాలతో పొత్తి కార్యక్రమం, జలాభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 4.15గంటలకు బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ, బోనాలను సమర్పించనున్నారు.

ఏజీఎఫ్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

వర్ధన్నపేట : అరూరి గట్టుమల్లు ఫౌండేషన్(ఏజీఎఫ్) ఆధ్వర్యంలో వర్ధన్నపేటలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను మంగళవారం ఎంపీపీ అన్నమనేని అప్పారావు సందర్శించి క్రికెట్ క్రీడాకారులతో సరదాగా క్రికెట్ ఆడారు. మంగళవారం లీగ్ మ్యాచ్‌లో కాశగూడెం, వర్ధన్నపేట డివిజన్ 7తో పోటీలను ఎంపీపీ టాస్ వేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వర్ధన్నపేట : పొద్దుతిరుగుడు, పుచ్చ తోటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వర్ధన్నపేట ఏఓ రాంనర్సయ్య సూచించారు. మంగళవారం మండలంలోని దమ్మన్నపేట, ల్యాబర్తి, దివిటిపల్లి తదితర గ్రామాల్లో ఉన్న పంట క్షేత్రాలను సందర్శించి పరిశీలించారు.

ఆర్థికసాయం

నర్సంపేట రూరల్ : నర్సంపేట రెండో వార్డు కమలాపురం గ్రామానికి చెందిన గుళ్లపురం శేఖర్ ఇటీవల బ్రెయిన్ డెడ్‌తో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి చిన్ననాటి స్నేహితులు పరామర్శించి రూ.41వేల ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో చిన్ననాటి స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి

నల్లబెల్లి : కంటి వెలుగును ప్రజలు వినియోగించుకోవాలని సర్పంచ్ మామిండ్ల మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొండాయిల్‌పల్లిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. అనంతరం నర్సంపేట డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రకాశ్ కంటి వెలుగు కార్యక్రమాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. 0 కార్యక్రమంలో ఎంపీటీసీ జన్ను జయరావు, ఉపసర్పంచ్ కొలగాని సదయ్య, పంచాయతీ కార్యదర్శి విష్ణు, డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల గ్రామ సందర్శన

గీసుకొండ : మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని వరంగల్ నగరంలోని ఇస్లామియా బీఈడీ కళాశాల విద్యార్థులు మంగళవారం సందర్శించారు. 40మంది విద్యార్థులతో పాటు వైస్ ప్రిన్సిపాల్ ఎండి అక్రం, అధ్యాపకులు షబానా ఆజ్మీ, పవన్‌కుమార్, షెహనాస్, స్వప్న, శ్రీదేవి, నస్రిన్ సుత్తానాలు పాల్గొన్నారు. జిల్లా ట్రెయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి వారికి గ్రామ అభివృద్ధి గురించి వివరించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

సంగెం : మండల కేంద్రంలోని సంఘమేశ్వరాలయంలో మహా శివరాత్రిని పురస్కరించుకుని నిర్వహించే బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆలయ అభివృద్ధి కమిటీ ఆవిష్కరించారు. ఈ నెల 18న స్వామి వారి కల్యాణం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పుల్వామా అమరులకు నివాళి


నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, డఫోడిల్స్ ఉన్నత పాఠశాలలో పుల్వామా అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఏఎస్ఆర్ సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు అమరులైన జవాన్లలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సమ్మెట సురేష్, చింతల నరేందర్, ఎర్రబోయిన రాజశేఖర్, బెజ్జంకి ప్రభాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుల్వామా అమరులకు..

నల్లబెల్లి : మండల కేంద్రంలో పుల్వామా అమరవీరుల చిత్రపటాలకు ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి మంగళవారం నివాళులర్పించారు. దేశం కోసం ప్రాణాలను అర్పించిన వీర జవానులను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అణగారిన వర్గాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పరికి కోర్నేల్ మాట్లాడుతూ.. అమరులైన వీర జవానుల త్యాగాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బట్టు సాంబయ్య, పులి రమేష్ గౌడ్, సింగనబోయిన కట్టయ్య, కొత్తగట్టు ప్రభాకర్, పులి చక్రపాణి, రఘువరణ్, కామగొని దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలి



నెక్కొండ: అవగాహన కల్పిస్తున్న అధికారులు

నెక్కొండ : పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కావాలని డీసీఈబీ సెక్రటరీ కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని నెక్కొండ మోడల్ స్కూల్‌లో పదోతరగతి వార్షిక పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీఈబీ అసిస్టెంట్ సెక్రటరీ శ్రీధర్, ఎంఈఓ రత్నమాల, హెచ్‌ఎం ఉదయశ్రీ, అలంఖానిపేట, కస్తూరిబా గాంధీ, మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహనతో చదవాలి

సంగెం : మండలంలోని మొండ్రాయి కాంప్లెక్స్ స్థాయిలో పదో తరగతి విద్యార్థులకు 11 పేపర్ల నుంచి 6 పేపర్లకు కుదించిన ప్రశ్నపత్రాలపై డీసీఈబీ కార్యదర్శి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. హెచ్‌ఎం లక్ష్మణ్, ఆర్‌పీలు వసుంధర, అశోక్, శ్రీనివాస్, కొమురయ్య, వాసుదేవా, రాజు పాల్గొన్నారు.

చెన్నారావుపేట: వార్షిక పరీక్షలు దగ్గరపడుతున్న క్రమంలో విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని డీసీఈబీ సెక్రటరీ కృష్ణమూర్తి సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ఓరియంటేషన్ క్లాసులను కాంప్లెక్స్ హెచ్‌ఎం రజిత ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు.

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనిమిరెడ్డి

రాయపర్తి : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే మండల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కంటి వెలుగు కార్యక్రమంపై ప్రజలకు అవగాహన లేకపోవడంతో రాలేకపోతున్నారని ప్రజలను చైతన్యం చేయాలని డాక్టర్ వెంకటేష్ ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. ఈసీజీతో పాటు పలు టెస్టులను చేసేందుకు పీహెచ్‌సీలో సిబ్బందిలేదని ఇది కొంత ఇబ్బందిగా ఉందని మిషన్‌లను వినియోగించాలని సర్పంచ్ గారె నర్సయ్య సభ దృష్టికి తీసుకొచ్చారు. కరెంట్ విషయంలో మారుమూల ప్రాంతంలో ఉండడంతో తమ దగ్గర వీధిలైట్లు పని చేయకపోవడంతో ఎన్నిసార్లు ఫోన్లు చేసినా పట్టించుకోవడంలేదని ఎర్రకుంటతండా సర్పంచ్ బీకోజీ సభ దృష్టికి తీసుకొచ్చారు. కరెంట్ సమస్య సన్నూరులో భాగా ఉందని సర్పంచ్ నలమాస సారయ్య తెలిపారు. మైలారం సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయ పొలాలకు వచ్చే విద్యుత్ సరిగ్గా ఇవ్వడంలేదని ఇదేంటని ప్రశ్నించేందుకు వెళ్లిన ప్రతీ సారి అందులో ఉండే సిబ్బంది నిద్రపోతూ కన్పిస్తున్నారని ఎంపీటీసీ బిల్లా రాధిక సభకు తెలిపారు. ఎవరిని ప్రశ్నించాలని ఏఈలు నిఖిల్, తరుణ్‌లను నిలదీశారు. వచ్చేది ఎండాకాలం కావున పంటలు ఎండిపోతే మీరే బాధ్యత వహించాలని రైతులంతా ఊరుకునేది లేదని సభలో హెచ్చరించారు. గట్టికల్, గన్నారంలో డబుల్‌బెడ్రూం ఇళ్లు పూర్తయినప్పటికి కరెంట్, డోర్‌లను ఏర్పాటు చేయడం లేదని త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ సత్యనారాయణ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఆ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అధికారులు ప్రజాప్రతినిధులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, ఎంపీడీఓ కిషన్, ఎంఈఓ రంగయ్య, వైద్యాధికారులు వెంకటేష్, శృతి, సోమశేఖర్, ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం


మాట్లాడుతున్న దొంతి మాధవరెడ్డి


మాట్లాడుతున్న నమిండ్ల శ్రీనివాస్

నెక్కొండ : గ్రామగ్రామాన కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా హాథ్ సే హాథ్ జోడో చేపట్టినట్లు ఏఐసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజలకు అన్ని రకాల సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి సాధ్యమని దొంతి మాధవరెడ్డి అన్నారు. దొంతి చేపట్టిన పాదయాత్ర మంగళవారం మండలంలోని నాగారం, నక్కలగుట్ట తండా, పెద్దకొర్పోలు, గుండ్రపెల్లి, మడిపల్లి శివారు తండాల్లో సాగింది. పాదయాత్రలో మాధవరెడ్డికి మహిళలు అడుగడుగునా మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన పలు చోట్ల ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, పెండెం రామానంద్, మండల అధ్యక్షుడు బక్కి అశోక్, పాల్వాయి శ్రీనివాస్, లక్ష్మణ్, రాచకొండ రఘు, నాయకులు, ఆయా గ్రామాల కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

యాత్రను విజయవంతం చేయాలి

వరంగల్ (పర్వతగిరి) : హాథ్ సే హాథ్ జోడో యాత్రను విజయవంతం చేయాలని వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈనెల 16వ తేదీన వర్ధన్నపేట నియోజకవర్గంలో జరిగే యాత్రకు కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : రేవంత్‌రెడ్డి పాదయాత్రను విజయవంతం చేయాలని బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హామ్యానాయక్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల అధ్యక్షుడు మాచర్ల ప్రభాకర్‌తో కలిసి మాట్లాడారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి


వర్ధన్నపేట: మాట్లాడుతున్న కొండేటి శ్రీధర్


నల్లబెల్లి: మాట్లాడుతున్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి


నెక్కొండ: మాట్లాడుతున్న అజయ్ కుమార్

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్

వర్ధన్నపేట: రాష్ట్రంలో బీఆర్ఎస్ అవినీతి పాలనను అంతం చేసేవరకు ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ అన్నారు. రామవరం గ్రామంలో 'ప్రజా గోస–బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా మంగళవారం కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అట్టడుగు వర్గాల వారికి చేరేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పే విధంగా ఉండాలన్నారు. గ్రామగ్రామాన బీజేపీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రతీ వ్యక్తిని చైతన్యం చేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. కార్నర్ మీటింగ్‌లతో ఎక్కడికెళ్లి సమావేశాలు నిర్వహించినా ప్రజలు బీజేపీని ఎంతగానో ఆదరిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గాడిపెల్లి రాజేశ్వర్‌రావు, రాయపురం కుమారస్వామి, పెద్దూ రి రాజ్‌కుమార్, ఐత రవికుమార్, బోంపెల్లి దేవేందర్‌రావు, కొండేటి సత్యం, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాసన సభ సమయం దుర్వినియోగం: రేవూరి

నల్లబెల్లి : ప్రజా సమస్యలపై చర్చించాల్సిన శాసన సభలో సీఎం కేసీఆర్, ప్రధానమంత్రి మోదీపై రాజకీయపరమైన విమర్శలు చేస్తూ సభ సమయాన్ని దుర్వినియోగం చేశారని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ప్రజా గోస–బీజేపీ భరోసా యాత్రలో భాగంగా మండలంలోని నారక్కపేట, రాంతీర్థం గ్రామాల్లో సోమవారం రాత్రి కార్నర్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రకాశ్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. నాందేడు బహిరంగ సభలో కేసీఆర్ 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నమని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణలో రైతు ఆత్మహత్యలు చేసుకుంటున్న పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు రేవూరి నర్సింహారెడ్డి, బొట్ల పవన్, వల్లె రమేష్, కొంపెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వాన్ని బలపర్చాలి

నెక్కొండ : రాబోయే ఎన్నికల్లో యువత మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని మాజీ ఎంపీపీ గటిక అజయ్‌కుమార్ అన్నారు. పల్లె గోస–బీజేపీ భరోసా యాత్రలో భాగంగా మండల కేంద్రంలోని అంగడి సెంటర్లో మంగళవారం స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు.కార్యక్రమంలో నాయకులు సింగారపు సురేష్, సొంటిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, కక్కెర్ల అనిల్, సందీప్, మాచర్ల రాజు, నాగిరెడ్డి, దయ్యాల వెంకన్న, సుదనపు సారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం

నెక్కొండ : మండలంలోని అజ్మీరా మంగ్యా తండా శివారులో బంజారాల ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ సంత్‌సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణ పనులను సర్పంచ్ సరోజవెంకట్ నాయక్ మంగళవారం ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు సహకరించిన ఉప సర్పంచ్ భూక్యా వీరన్నను అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మాలోత్ వెంకన్న నాయక్, నాయకులు మాలోత్ శ్రీనివాస్, బానోత్ ప్రవీణ్ పాల్గొన్నారు.

నేడు సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి

వరంగల్ (పర్వతగిరి) : సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సింగ్‌లాల్, ఎంపీపీ కమలపంతులు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ సభా ప్రాంగణంలో మంగళవారం రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో నేడు(బుధవారం) జరిగే సేవాలాల్ జయంతికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.